## క్లుప్తంగా

### ముగిసిన బ్రహ్మోత్సవాలు



**వనపర్తి క్రైం:** వారం రోజులుగా జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో అంగరంగవైభంగా నిర్వహిస్తున్న 46వ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు స్వామివారికి అభిషేకం, చక్రస్నానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. అనంతరం ధ్వజారోహణం, పుష్పయాగం తర్వాత ఆచార్యులను సన్మానించినట్లు ఆలయ నిర్వాహకులు రఘునాథచార్యులు, కౌన్సిలర్ అలైఖ్య, వికాస తరంగిణి సభ్యులు నరేందర్, తిరుమల్, కృష్ణమోహన్, శ్రీధర్, గంగాధర్, రాజేశ్వరి, పల్లవి తదితరులు ఉన్నారు.

### వసతుల పరిశీలన

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలోని వసతులను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులు విద్యలో రాణించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎస్‌ఓ స్వప్న పాల్గొన్నారు.

### పరామర్శ

**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలంలోని ముందరితండా పంచాయతీకి చెందిన పూపావత్ దుర్గా నాయక్(45) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ మండల నాయకుడు గోపాల్‌నాయక్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో రమేష్‌నాయక్, చీన్యానాయక్, శంకర్ నాయక్, కిషన్‌నాయక్, జగదీష్ ఉన్నారు.

### పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి



**కొత్తకోట రూరల్:** రాష్ట్రంలో త్వరలో విడుదల చేసే పీఆర్సీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కొత్తగా కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు డిమాండ్ చేశారు. త్వరలో జరుగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం పెద్దమందడి మండలంలోని కేజీబీవీ, వెల్టూర్, మోజర్ల, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందంతో మాట్లాడారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్‌గౌడ్, మనోహర్‌గౌడ్, శశివర్ధన్, అశ్విని రవికుమార్, వెంకటనారాయణ, పి.రవికుమార్, రాజు, రాకేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### ఘన నివాళి

**ఖిల్లాఘనపురం:** డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడ్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

### 50 వేల గొర్రెలకు మందులు

**ఆత్మకూర్:** నట్టల నివారణ మందులతో మేకలు, గొర్రెల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఇప్పటి వరకు 50వేలకుపైగా గొర్రెలు, మేకలకు మందులను పంపిణీ చేసామని పశు వర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, డాక్టర్ రమేష్ వెల్లడించారు. ఆత్మకూర్ మండలంలోని రేచింతలలో మంగళవారం పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టలనివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో జేఈఓలు నిర్మల, ఇంద్రజ, సిరాజుద్దీన్, మహిమూద్ పాల్గొన్నారు.

### ఘనంగా టైలర్స్ డే



**వనపర్తి క్రైం:** జిల్లా కేంద్రంలో మంగళవారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టైలర్ మన్యం ఏర్పాటు చేసిన హెల్మెట్ల వితరణ కార్యక్రమానికి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి హాజరై పలువురికి హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ చైర్మన్ రమేష్‌గౌడ్, వైస్ చైర్మన్ వాకిటీశ్రీధర్, మండ్ల దేవన్న తదితరులు ఉన్నారు.

**ఆత్మకూర్:** టైలర్ల దినోత్సవం సందర్భంగా సందర్భంగా ఆత్మకూర్‌లో టైలర్లు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు ఆనంద్‌రావు, జిందే విశ్వనాథ్, నజీర్‌అహ్మద్, తిరుపతయ్య, మహేష్‌గౌడ్, రామదర్శన్, వెంకటేష్, ఆంజనేయులు, శ్రీనివాసులు, చెన్నయ్య పాల్గొన్నారు.

# ప్రయోగాలతోనే విద్యార్థుల్లో మేధాశక్తి

**వనపర్తి టౌన్:** సైన్స్‌తోనే విజ్ఞానం వికసిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. మంగళవారం శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలను కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, పుట్టపాకల మహేష్, గిరితో కలిసి తిలకించారు. ఈ మేరకు శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీయడంలో సాంకేతిక పరిజ్ఞాన ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వ బాలుర డిగ్రీ కో-ఎడ్ కళాశాల, స్కాలర్స్ జూనియర్ కళాశాల, తెలుగువాడ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన మేళాలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, లెక్చరర్లు ఓబులేష్, సురేందర్‌రెడ్డి, యాదగిరిగౌడ్, కురుమయ్య, రఘునందన్, స్కాలర్స్ జూనియర్ కళాశాల యాజమాన్య సభ్యులు డాక్టర్ వరప్రసాద్‌రావు, డాక్టర్ జగదీశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీధర్, తెలుగువాడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రమాదేవి, శేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**అమరచింత:** ప్రతి విద్యార్థి చదవుతో పాటు వివిధ అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కలిగి ఉన్నప్పుడే వారిలో దాగిన నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని జెడ్పీ ఉన్నన పాఠశాల హెచ్‌ఎం బలరాం అన్నారు. పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాత్మక పరికరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులను అందించారు.



వనపర్తిలో సీవీరామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఫిజిక్స్‌లో క్విజ్, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగలీల, ఉపాధ్యాయులు అరుణ, ప్రసన్నకుమారి, మహేశ్వరమ్మ, శ్రీదేవి, భాగ్యచంద్రిక, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

**పాన్‌గల్:** పాఠశాలల్లో సైన్స్ పాఠ్యాంశాల్లోని ప్రయోగాలను చార్ట్స్ ద్వారా వివరించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తి, ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సైన్స్‌డే సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగాలను ఆయన పరిశీలించారు. అంతకుముందు ఆయన సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంతో పాటు మాందాపూర్, కేతేపల్లి, రేమద్దుల ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలను నిర్వహించారు.



వనపర్తి శ్రీచైతన్య పాఠశాలలో..

**ఆత్మకూర్:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీవాణి హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..



ఆత్మకూర్‌లో..



శ్రీరంగాపురంలో..



పాన్‌గల్‌లో..

### రేపు వైద్య శిబిరం

**చిన్నంబావి:** మండల కేంద్రంలోని శివసాయి రత్నగిరి ఆస్పత్రిలో ఈ నెల 2న వనపర్తికి చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ లక్ష్మీజీ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**పాన్‌గల్:** మండలంలోని మాందాపూర్‌కు చెందిన యాదమ్మ, వావిలాల కృష్ణయ్య, మన్నెమ్మ కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం సర్పంచ్ జయరాములుసాగర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. యాదమ్మకు రూ.9వేలు, కృష్ణయ్యకు రూ.11వేలు, మన్నెమ్మకు రూ. 40,500 చెక్కును అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలకు కార్పొరేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. చెక్కులను మంజూరు చేయించిన మాజీమంత్రి జూపల్లి కృష్ణారావుకు, మండల నాయకులకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్‌సాగర్, శ్రీరాములు, రాములు పాల్గొన్నారు.

### మొక్కల సంరక్షణకు చర్యలు

**పాన్‌గల్:** వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని రాయినిపల్లి నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. ఎండ తగలకుండా నెట్ ఏర్పాటు చేయడం, క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలన్నారు. దీంతో పాటు ఉపాధి పనులను పరిశీలించారు. పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని కార్యదర్శిని ఆదేశించారు.

## చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన

**మదనాపురం:** మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు మంగళవారం వనపర్తి మండలంలోని కాశింనగర్ రైతువేదికలో చిరుధాన్యాల ప్రయోజనాలు, వాటి ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ భవాని మాట్లాడుతూ చిరుధాన్యాలు వాతావరణ స్మార్ట్ పంట అని పేర్కొన్నారు. వాటిలో ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. స్థానిక ఉత్పత్తి సంస్థ చిరుధాన్యాల ఉత్పత్తి పెంచడంలో సహాయపడడం మాత్రమే కాకుండా.. దేశీయ అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేయడంలో సహాయపడుతుందని వెల్లడించారు. ఈ విషయమై దృష్టి సారించాలని కోరారు. నాబార్డ్ మద్దతు, పీఎం ఎఫ్‌ఎంఈ వంటి ప్రభుత్వ పథకాలు చిరుధాన్యాల ప్రాసెసింగ్ ప్లాంట్ విలువ ఆధారిత ఉత్పత్తుల నెలకొల్పడానికి ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఓ డైరెక్టర్లు, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సూర్యతేజ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భవాని

## మెడికో ప్రీతి మృతిపై ప్రభుత్వం స్పందించాలి

**ఖిల్లాఘనపురం:** మెడిసిన్ విద్యార్థిని ప్రీతి మృతిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చౌరస్తాలో ప్రీతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ విజయలక్ష్మి, కృష్ణయ్యయాదవ్, సంజీవరెడ్డి, జయకర్, గోవిందు, లింగస్వామి, శరవంద పాల్గొన్నారు.

**మదనాపురం:** వైద్య విద్యార్థిని ప్రీతి మరణానికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు మౌనం పాటించి ప్రీతి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నిక్సన్, కవిత, అరుణ, శారద, రాధ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నంబావి:** బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని బీఎస్పీ కొల్లాపూర్ అసెంబ్లీ కార్యదర్శి బొల్లి కురుమయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న అరాచకాలను అరికట్టడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఇటీవల వరంగల్ జిల్లాలోని కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ విద్యార్థిని ప్రీతి సీనియర్ల వేధింపులు భరించలేక కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో చివరికి ఆత్మహత్య చేసుకుని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిందని వాపోయారు.

## ప్రేరణ తరగతులను పకడ్బందీగా నిర్వహించాలి

**ఖిల్లాఘనపురం:** పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులకు నిర్వహించే ప్రేరణ తరగతులపై మంగళవారం ఎంఈఓ ఉషారాణి ఆధ్వర్యంలో ఎమ్మార్సీలో హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు ఈ ప్రేరణ తరగతులు కాంప్లెక్స్‌ల వారీగా నిర్వహిస్తామని ఎంఈఓ తెలిపారు. 1వ తేదీన మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి పాఠశాలలో, 2వ తేదీన ఖిల్లాఘనపురం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, 3వ తేదీన సోళీపురం, మానాజీపేట పాఠశాలల విద్యార్థులకు సోళీపురం ఉన్నత పాఠశాలలో ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రో జుల పాటు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం



అప్పారెడ్డిపల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



తూంకుంట ఉన్నత పాఠశాలలో..

**పాన్‌గల్:** మండలంలోని శాగాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్‌గా రీను, డీఈఓగా గోవర్ధన్, ఎంఈఓగా కిరణ్, హెచ్‌ఎంగా లావణ్యతో పాటు 37 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

**మదనాపురం:** మండలంలోని నర్సింగాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా నందకుమార్, ఎంఈఓగా పల్లవి, ప్రధానోపాధ్యాయురాలుగా భవాని వ్యవహరించారు. విద్యార్థులు తమ విధులను చక్కగా నిర్వర్తించారని ప్రధానోపాధ్యాయులు మాణిక్యమ్మ ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** మండలంలోని తూంకుంట ఉన్నత పాఠశాలలో మంగళవారం 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా శ్రీనివాసులు, డీఈఓగా మానస, ఎంఈఓగా అనిత, ప్రధానోపాధ్యాయులుగా సాయికుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్, సీఆర్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఖిల్లాఘనపురం:** మండలంలోని అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పారెడ్డిపల్లి పాఠశాలలో విద్యాశాఖ మంత్రిగా గణేష్, ఆర్‌జేడీగా అరుణ్, కలెక్టర్‌గా చందు, డీఈఓగా మౌనిక, ఎంఈఓగా కళ్యాణి, హెచ్‌ఎంగా శివ వ్యవహరించగా మరో 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. అదేవిధంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. అల్లమాయపల్లి పాఠశాలలో హెచ్‌ఎంగా వరలక్ష్మి, ఎంఈఓగా నర్సింహులు, డీఈఓగా సాయిరామ్ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కొండల్‌రావు, ఎంఈఓ ఉషారాణి, హెచ్‌ఎంలు సూర్యసంజీవ్, నవీన్, శంకర్ పాల్గొన్నారు.



శాగాపూర్ ఉన్నత పాఠశాలలో..



నర్సింగాపురంలో ప్రాథమిక పాఠశాలలో..

# గడీల పాలనకు స్వస్తి పలుకుదాం: బీజేపీ

**అమరచింత:** రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అరాచక పాలన గురించి ప్రజలకు వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాల్సిన అవసరం ఉందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. పట్టణంలోని బీసీ కాలనీలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం కాజేస్తూ మళ్లీ కేంద్రంపైనే విమర్శలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు అనుభవిస్తున్న పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే అన్న విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు గుర్తించుకోవాలన్నారు. రాష్ట్రంలో నియంతలా వ్యవహరిస్తు నిజాం పరిపాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మరాఠి అశోక్, మహేష్, కౌన్సిలర్ ఉషారాణి, క్యామ భాస్కర్, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణు, నరసింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఖిల్లాఘనపురం:** రాష్ట్ర ప్రజలకు దొరల పాలన నుంచి విముక్తి కలిగిద్దామని బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ జింకల కృష్ణయ్య, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మామిడిమాడ, మానాజీపేట గ్రామాల్లో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రవీంద్రాచారి, భద్రయ్య, దశరథ్ ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతు నాడు ఎన్నో ఉద్యమాలు చేసి సీమాంధ్ర పాలకుల సంకెళ్ల నుంచి తెలంగాణ విడిపించుకున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపినాయక్, మండల ఉపాధ్యక్షుడు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో మాట్లాడుతున్న మేర్వరాజు

**ఆత్మకూర్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే అభివృద్ధి సాధ్యమని, దేశ ప్రజలకు ఎన్నోవిధాలుగా మేలు చేస్తూ ముందుకెళ్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ రేచింతల శ్రీను అన్నారు. మంగళవారం మండలంలోని రేచింతలలో ప్రజాఘోష బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్రంపై ప్రతిపక్షాలు విషం కక్కుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, భరత్ భూషణ్, రాజు, ఎల్లన్న, కొండాపురంరాము, నాగేందర్, రాము, అశోక్, బ్రహ్మయ్య, శేషు, యశ్వంత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**వనపర్తి టౌన్:** రాష్ట్ర విద్యాశాఖ నుంచి వనపర్తి జిల్లా విద్యాశాఖకు వచ్చిన గణితం, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘీక శాస్త్ర స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకి వచ్చిన స్టడీ మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టడీ మెటీరియల్ తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో వచ్చాయని, వాటిని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసి పదో తరగతి విద్యార్థులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో జరగబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 10జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అందుకు విద్యార్థులు సాధన చేయాలని సూచించారు.

### అనుమతి లేని వెంచర్‌లో నిర్మాణాలు

**అమరచింత:** పట్టణ శివారులో ఉన్న శ్రీహరిహర పుత్ర అయ్యప్ప రియల్ ఎస్టేట్ వెంచర్‌లో అక్రమంగా ఇంటి నిర్మాణాలు కొనసాగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా అన్నారు. లేఅవుట్, డీటీపీసీ అనుమతులు వెంచర్లకు తప్పనిసరి అని నిబంధనలు ఉన్నా కొంతమంది నాలా పర్మిషన్‌తో వెంచర్లు చేసి ఇంటి స్థలాలను విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల నుంచి అనుమతులు లేని హరిహర పుత్ర వెంచర్‌లో ఇద్దరు వ్యక్తులు ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తమకు ఫిర్యాదు అందటంతో సిబ్బందిని పని ప్రదేశానికి పంపి, పనులను నిలిపేశామన్నారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులు చేస్తే చర్యలు తప్పవన్నారు.

### ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**కొత్తకోట:** మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ శాసన మండలి నియోజక వర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా బలపరిచిన కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు తలకంటి మహిపాల్‌రెడ్డి కోరారు. కొత్తకోట ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, పామాపురం, మిరాసిపల్లి, అప్పరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి రాయినిపల్లి శ్రీనివాసులు, చంద్రశేఖర్, సురేష్‌కుమార్ ఉన్నారు.

**పెద్దమందడి మండలంలో..**
పెద్దమందడి మండలంలోని కస్తూర్బా పాఠశాల, వెల్టూర్, మోజర్ల, మద్దిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఆర్టీయూ తెలంగాణ ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం సభ్యులు ప్రచారం నిర్వహించారు.

## కేబీఎస్ బ్యాంకు ఆధ్వర్యంలో అంబులెన్స్ వితరణ

**ఆత్మకూర్:** కేబీఎస్ బ్యాంకు 22వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు రూ.18 లక్షలతో అంబులెన్స్‌ను వితరణగా అందించి ఔదార్యం చాటుకున్నారు. మంగళవారం కేబీఎస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మల్టీస్పెషాలిటీ అంబులెన్స్ తాళాన్ని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ల జిల్లా సూపరిటెండెంట్ రాజ్‌కుమార్ అందజేశారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేబీఎస్ బ్యాంకుల ఆధ్వర్యంలో సామాజిక సేవ, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కేబీఎస్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, సీఎఫ్‌ఓ మురళీకృష్ణ, సీసీఓ మహేశ్వర్లు, డీజీఎం ఐటీ రాజు, ఏజీఎం ప్రసాద్, బ్రాంచ్‌మేనేజరు సతీష్‌రెడ్డి, వైద్యులు హరినారాయణ, నిస్సార్‌అహ్మద్, శబరి, బ్యాంకు, వైద్యసిబ్బంది ఉన్నారు.



అంబులెన్స్ తాళాన్ని వైద్యులకు అందిస్తున్న కేబీఎస్ బ్యాంక్ ఎండీ దుర్గాప్రసాద్

### కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు



**ఆత్మకూర్:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శమని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర నాయకుడు, ఎన్‌ఆర్‌ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రేచింతలలో అనారోగ్యానికి గురైన సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిని పరామర్శించి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న నివాసంలో సమావేశమయ్యారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహంకాళి విష్ణు, జుబేర్‌అహ్మద్, విష్ణువర్ధన్‌యాదవ్ ఉన్నారు.

### అటెండర్‌కు సన్మానం

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పదవీ విరమణ పొందిన గట్టయ్యను మంగళవారం హెచ్‌ఎం కురుమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కవిరాజుగౌడు, కురుమయ్య, చైతన్యకుమారి, నాగేందర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, రాజేష్, అనురాధ, సౌజన్య, కృష్ణవేణి, జిక్కి రవి, ఎల్లస్వామి, ఎల్లయ్య, విజయ్, నిరంజన్‌గౌడ్ ఉన్నారు.

### పరిశుభ్రత పాటించాలి

**పాన్‌గల్:** విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే రోగాలకు దూరంగా ఉండొచ్చని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. భోజనానికి ముందు చేతులను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు, వడదెబ్బ వంటి వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

